మతతత్వ పార్టీలను ప్రజలు నమ్మరు

బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్

అబిడ్స్: మతతత్వ పార్టీలైన మజ్లిస్, బీజేపీలను ప్రజలు నమ్మడం లేదని హైదరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం గోషామహల్ నియోజకవర్గంలోని మహేశ్వరీ భవన్, బేగంబజార్, సిద్దిఅంబర్‌బజార్, దేవినగర్, భగవాన్‌గంజ్, పుత్లీ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రచారం చేశారు. అనంతరం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ..తనను గెలిపిస్తే హైదరాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. 40 ఏళ్లుగా మజ్లిస్ పార్టీ ఎలాంటి అభివృద్ధి చేయకపోవడంతో హైదరాబాద్ అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే హైదరాబాద్ నలుమూలలా వందల కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్

జియాగూడలో బీఆర్ఎస్ ప్రచారం

జియాగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో విఫలం కావడంతో ప్రజలు తిరిగి బీఆర్ఎస్‌ను గెలిపించడానికి స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని బీఆర్ఎస్ కార్వాన్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు మంగి కిశోర్‌కుమార్, జియాగూడ అధ్యక్షుడు నరహరిచారి అన్నారు. మంగళవారం జియాగూడలో గల ఇందిరానగర్‌లో హైదరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్‌కు ఓటు వేసి గెలిపించాలని ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ నాయకుడు జగ్గు యాదవ్, శ్రీనివాస్‌గుప్తా, దేవేందర్ సాగర్, అనిత, సంగీత, అరుణ, నర్సింగ్‌రావు, హేమంత్, కృష్ణదాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం..

అబిడ్స్: బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాల ప్రజల అభివృద్ధి సాధ్యమని నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి సీహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. గత పదేళ్లలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో వందల కోట్ల అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. మంగళవారం మహిళా నాయకురాళ్లతో ఆనంద్‌కుమార్‌గౌడ్ సమావేశం నిర్వహించి బీఆర్ఎస్ అభ్యర్థి పద్మరావు గౌడ్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఏ ప్రాంతానికి వెళ్లినా తిరిగి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రజలు గుర్తు చేస్తున్నారన్నారు. పద్మారావుగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌సాగర్ పాల్గొన్నారు.

మొఘల్‌పురాలో బీఆర్ఎస్ ప్రచారం..



ఆటో డ్రైవర్లతో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పుప్పాల రాధాకృష్ణ

చార్మినార్: మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల పొట్టకొట్టిందని.. గిరాకీ లేక కుటుంబ సభ్యులు పస్తులుంటున్నారని మొఘల్‌పురా డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పుప్పాల రాధాకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి తరఫున ఆయన మంగళవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆటోడ్రైవర్ల కష్టాలను అడిగి తెలుసుకున్న ఆయన వారందరీ ఆటోరిక్షాలలో గ్యాస్‌ను ఉచితంగా కొట్టించారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధిస్తే పేదల సంక్షేమానికి మాజీ సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తారన్నారు.

మజ్లిస్ vs బీజేపీ

నాలుగు ప్రధాన పార్టీల అభ్యర్థులు బరిలో ఉన్నా మజ్లిస్, బీజేపీదే హవా

వినూత్న తరహా అసదుద్దీన్ ఒవైసీ ఎన్నికల ప్రచారం

సామాజిక వర్గాల వారీగా సమావేశాల్లో బిజీగా మాధవీలత





చార్మినార్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం పీక్ స్టేజ్‌కు చేరుకుంది. పాదయాత్రలు, ఇంటింటికీ ప్రచారం, రోడ్డు షోలు, కార్నర్ మీటింగ్‌లు, పబ్లిక్ మీటింగ్‌లు, వివిధ సామాజిక వర్గాల వారీగా సమావేశాలతో ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతోంది. హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో పాటు బీజేపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలత, బీఆర్ఎస్ నుంచి గడ్డం శ్రీనివాస్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ నుంచి మహ్మద్ వలీ ఉల్లా సమీర్ నాలుగు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. నాలుగు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నా.. పోటీ మాత్రం మజ్లిస్ వర్సెస్ బీజేపీ లాగా కనిపిస్తోంది.

మజ్లిస్ ప్రచార జోరు..

మాధవీలత ఎన్నికల ప్రచారాన్ని మొదటి నుంచి గమనిస్తున్న మజ్లిస్ పార్టీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ తన ఎన్నిల ప్రచారం పంథాన్ని పూర్తిగా మార్చి వేశారు. ఒక వర్గం వారి కోసం పని చేస్తున్నట్లున్న అపవాదు నుంచి బయటపడే ప్రయత్నాలు జోరుగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా తెలుగులో ఓటు వేయాలని కోరడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లను ఆకట్టుకునే విధంగా ప్రచారం నిర్వహిస్తూ అందరిని ఆకట్టుకుంటున్నారు. వేద పండితుల ఆశీర్వాదం సైతం పొందుతూ.. జై భీం నినాదాలతో ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇక గతంలో ఎన్నడు లేని విధంగా తెలుగులో నల్గొండ గద్దర్‌తో పాడించిన పాటలను ఎన్నికల ప్రచారంలో వినియోగిస్తున్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రచారం అంతంతే..

మజ్లిస్ పార్టీ, బీజేపీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని జోరుగా నిర్వహిస్తుండగా.. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి తనకు అనుకూలంగా ఉన్న బస్తీల్లో అందుబాటులోని నాయకులు, కార్యకర్తలతో అక్కడక్కడ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. పాతబస్తీలోని కొన్ని ప్రాంతాల్లో పార్టీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్ లేకుండానే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌ల చిత్ర పటాలతో ఎన్నికల ప్రచారం కొనసాగుతోంది. ఇక కాంగ్రెస్ అభ్యర్థి ఆలస్యంగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించి కొనసాగిస్తున్నారు. దీంతో ప్రస్తుతం హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం మజ్లిస్ పార్టీ వర్సెస్ బీజేపీగా కొనసాగుతోంది.

మజ్లిస్‌కు కంచుకోటను ఢీకొట్టే ప్రయత్నంలో..

హైదరాబాద్‌కు కంచుకోట అయిన మజ్లిస్ పార్టీని ఢీ కొట్టే ప్రయత్నం బీజేపీ చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే మాధవీలత తన ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతోంది. కేవలం పాదయాత్రలు, రోడ్డు షోలు, పబ్లిక్ మీటింగ్‌లకే పరిమితం కాకుండా బీజేపీలోని అన్ని సామాజిక వర్గాల వారీగా ఉన్న విభాగాల (ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ, మైనార్టీల) ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి దశ దిశ నిర్దేశిస్తున్నారు. రాజకీయంగా హైదరాబాద్ అంటేనే.. మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. ఇప్పటికీ దేశ వ్యాప్తంగా వార్తల్లో వ్యక్తి అసదుద్దీన్ ఒవైసీని టార్గెట్‌గా చేసుకుని మాధవీలత తన ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఇక మంత్రి అమిత్ షా రోడ్డు షో విజయవంతం కావడంతో మరింత ఉత్సాహంగా ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. సున్నిత అతి సున్నిత ప్రాంతాల్లో సైతం కాలినడకన దూసుకు వెళ్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. తాను విజయం సాధిస్తే కుల, మతాలకు అతీతంగా పాత బస్తీని అభివృద్ధి చేస్తానంటూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు.

మహిళలకు అండగా సకీనా ఫౌండేషన్



గోల్కొండ: నిరుపేద మహిళలకు సకీనా ఫౌండేషన్ అండగా ఉంటుందని ఫౌండేషన్ చైర్మన్ ఆసీఫ్ హుస్సేన్ సోహెల్ అన్నారు. మంగళవారం ఫౌండేషన్ తరఫున షేక్‌పేట్ డివిజన్ విరాట్‌నగర్ కుంటలో మహిళల టైలరింగ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, బడుగు వర్గాల కోసం సకీనా ఫౌండేషన్ గత రెండు దశాబ్దాలుగా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి విజయవంతంగా పూర్తి చేసిందన్నారు. టైలరింగ్ సెంటర్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కుట్టు మిషన్ ఇస్తామన్నారు.

బద్దం బాల్‌రెడ్డికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకుడు దేవర వంశీ తదితరులు

గోల్కొండ: కార్వాన్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు దివంగత బద్దం బాల్‌రెడ్డి జయంతిని మంగళవారం గుడిమల్కాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకుడు దేవర వంశీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాధాకిషన్, నామ యాదగిరి నేత, అనిల్‌కుమార్, ముఖేష్‌సాగర్, సుధాకర్‌యాదవ్, సందేష్ యాదవ్ తదితరులున్నారు.

సన్మానం



గన్‌ఫౌండ్రీ: కవులు, రచయితలను సన్మానించుకోవడం ఎంతో అభినందనీయమని దూరదర్శన్ విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ జనరల్ అనంత పద్మనాభరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కళాసూర్య కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వజ్ర భారత అభినందన సత్కారాలను మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..75 మంది కవులు, గాయకులను ఒకే వేదికపై సత్కరించడం ఎంతో బావుందన్నారు. అంతకు ముందు చిన్నారుల గీతాలాపన ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి ఎ.శ్రీకర్, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞ శర్మ, తెలంగాణ ఉద్యోగుల సంఘం పూర్వ అధ్యక్షుడు పద్మచారి, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, సంస్థ అధ్యక్షుడు ఎ.ప్రభాకరచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యుడిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



డీఎంఈ కార్యాలయం వద్ద ధర్నాకు దిగిన తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం

సుల్తాన్‌బజార్: కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడిపై దాడి చేసిన వారిని 24 గంటల్లో అరెస్టు చేయాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా వైద్యసేవలను నిలిపివేస్తామని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం హెచ్చరించింది. మంగళవారం కోఠిలోని డీఎంఈ కార్యాలయం ముందు తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుల సంఘం ప్రతినిధులు డాక్టర్ బొంగు రమేష్, డాక్టర్ లాలుప్రసాద్ రాథోడ్, సంతోష్‌బాబు, డాక్టర్ రాటఫల బృందం వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దాడికి కారకులైన వారిని వెంటనే అరెస్టు చేసేలా చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..జగిత్యాల జిల్లా కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 5న డాక్టర్ శ్రవణ్‌కుమార్‌పై దాడిచేసిన రోగి బంధువులను తక్షణమే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు అజ్మీర రంగ, డాక్టర్ భూపేందర్ సింగ్, డాక్టర్ నరహరి పాల్గొన్నారు.

హైదరాబాద్ గెలుపుతో బీజేపీకి 401 ఎంపీ సీట్లు

రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ

అబిడ్స్/అఫ్జల్‌గంజ్: దేశంలో బీజేపీ గాలి వీస్తుందని 400 సీట్లు గెలుచుకునే బీజేపీ హైదరాబాద్ గెలుపు 401 సీటు అవుతుందని రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ పేర్కొన్నారు. హైదరాబాద్ పాతబస్తీలో బీజేపీ అభ్యర్థి మాధవీలతకు మద్దతుగా మంగళవారం రాత్రి బేగంబజార్ నుంచి సిద్ది అంబర్‌బజార్ వరకు నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా వ్యాపార రంగాల్లో మొదటి స్థానంలో ఉన్న మార్వాడీలంతా హైదరాబాద్‌లో బీజేపీని గెలిపించేందుకు కూడా ముందంజలో ఉండాలన్నారు. రోడ్డు షోలో ప్రేమ్‌సింగ్ రాథోడ్, పాండు యాదవ్, ముక్క కృష్ణాగుప్తా, కార్పొరేటర్లు లాల్ సింగ్, శంకర్ యాదవ్, భీశ్వ ఓంప్రకాష్, సీనియర్ నాయకులు సోమ్రాజ్ సింగ్, నట్రాజ్ నామ్‌దారి పాల్గొన్నారు.

రాజస్థాన్ ముఖ్యమంత్రికి సన్మానం

అబిడ్స్: రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మన్ ఘనంగా సత్కరించారు. గోషామహల్ నియోజకవర్గ బీజేపీ నాయకుడు బబుత్‌సింగ్ రాజ్ పురోహిత్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి మార్వాడి పగిడి కట్టి సత్కారం చేశారు. ఈ సందర్భంగా బబుత్ సింగ్ రాజ్ పురోహిత్ మాట్లాడుతూ..దేశ నలుమూలలా బీజేపీ ప్రభంజనం వీస్తుందన్నారు. హైదరాబాద్‌లో కూడా బీజేపీ విజయం సాధించి రికార్డు తిరగరాస్తుందన్నారు.



ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మను సన్మానిస్తున్న బీజేపీ నాయకుడు బబుత్ సింగ్ రాజ్ పురోహిత్

పాతబస్తీలో భారీ వర్షం

చార్మినార్/యాకుత్‌పురా: పాతబస్తీలో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు వర్షం దంచి కొట్టింది. సాయంత్రం బలమైన ఈదురు గాలులతో ప్రారంభమైన వర్షం రెండు గంటలపాటు ఏకధాటిగా కురిసింది. దీంతో పాతబస్తీలోని లోతట్టు ప్రాంతాలతో పాటు కొన్ని బోట్ల రోడ్లలో కూడా వరద నీరు చేరింది. దీంతో అటువైపు నుంచి రాకపోకలు సాగించిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నయాపూల్ సాలార్జంగ్ మ్యూజియం రోడ్‌లోని ఓ భారీ చెట్టు కొమ్మలు విరిగి పడ్డాయి. అప్పుడే అటువైపు నుంచి వస్తున్న కారు ముందు భాగంపై ఈ కొమ్మలు పడటంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. కారులోని వారికి ఎలాంటి గాయాలు కాలేదు. వెంటనే స్పందించిన మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కొద్దిసేపు స్తంభించిన ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అలాగే శాలిబండ ప్రధాన రోడ్డులో కూడా మరో భారీ చెట్టు నేలకొరిగింది. ఇక్కడ కూడా కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వర్షం ప్రారంభమైన అనంతరం రాత్రి వరకు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలిగింది.



సాలార్జంగ్ మ్యూజియం రోడ్డులోని నయాపూల్ వద్ద ..

నివాళి



అబిడ్స్: రవీంద్రనాథ్ ఠాకూర్ జయంతి వేడుకలు, అల్లూరి సీతారామరాజు, దామోదరం సంజీవయ్యల వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీభవన్‌లో వారి చిత్రపటాలకు టీపీసీసీ కార్యదర్శి మనిలాల్‌షా, సీనియర్ నాయకులు వీ.హన్మంతరావు, కుమార్‌రావు, భాస్కర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, సీతారామ్ తదితరులు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'రాష్ట్ర హజ్ కమిటీ పనితీరు భేష్'



గోల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులతో కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ అజారుద్దీన్

గోల్కొండ: తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ పనితీరు అద్భుతమని భారత క్రికెట్ మాజీ సారథి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ అజారుద్దీన్ అన్నారు. మంగళవారం గోల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు ఆయనను హజ్ కమిటీ కార్యనిర్వహణ అధికారి లియాకత్ హుస్సేన్‌తో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హజ్ యాత్రకు వెళ్లే వారి కోసం అన్ని సౌకర్యాలు సకాలంలో అన్ని రకాల సేవలు చేస్తున్న ఏకైక వక్ఫ్‌బోర్డు తెలంగాణ రాష్ట్రానిదే అని ఆయన అన్నారు. హజ్ కమిటీ కార్యానిర్వహణ అధికారి లియాకత్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఈసారి హజ్ యాత్రకు ఎంపికైన వారి కి వ్యాక్సినేషన్ కేంద్రాలను పెంచడం జరిగిందన్నారు. వైద్యుల కృషి వల్ల కేవలం వారం రోజుల వ్యవధిలో వ్యాక్సినేషన్ పూర్తి చేశామన్నారు. గోల్కొండ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు ఆబీద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇలియాస్ ఆలీ ఉన్నారు.

అన్ని వర్గాల ప్రజల మద్దతు కాంగ్రెస్‌కే



ఎన్నికల ప్రచారంలో అలీ మస్కతి

చార్మినార్: అన్ని వర్గాల ప్రజల మద్దతు కాంగ్రెస్‌కే ఉందని తెలంగాణ ప్రచార, ప్రణాళిక కమిటీ కన్వీనర్ అలీ మస్కతి అన్నారు. మంగళవారం నిర్వహించిన ప్రచారం అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ గాలి వీస్తోందన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని వర్గాల ఓటర్లతో పాటు ముస్లిం ఓటర్లు తమ పార్టీ అభ్యర్థులకే ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించనున్నారని పేర్కొన్నారు. ఇక హైదరాబాద్‌లో మత రాజకీయాలకు స్థానికులు స్వస్తి చెప్పనున్నారన్నారు. సెక్యులర్ పార్టీ అయిన కాంగ్రెస్‌కు ఓటు వేయడానికి ఇరు వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు తెలియజేస్తున్నారన్నారు. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న గ్యారంటీ పథకాలతో సంతృప్తి చెందుతున్న ఇరు వర్గాల ఓటర్లు తమ పార్టీకే ఓటు వేయనున్నారన్నారు.

ప్రజలంతా మజ్లిస్ వైపే: అక్బరుద్దీన్



గోల్కొండ: ప్రజలు ఈసారి కూడా మజ్లిస్ పార్టీ వైపే మొగ్గు చూపుతున్నారని ఆ పార్టీ శాసన సభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. మంగళవారం ఆయన గోల్కొండ, లంగర్‌హౌస్ డివిజన్లలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన గోల్కొండ చౌరస్తా వద్ద ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. మజ్లిస్ పార్టీ పనితీరు ప్రతి ఒక్కరికి తెలుసు అని మజ్లిస్ పార్టీ పేద ప్రజల కోసం పుట్టిన పార్టీ అని ఆయన అన్నారు. ఎమ్మెల్యేగా తాను తన నియోజకవర్గానికి చెందిన సమస్యలే కాకుండా రాష్ట్రంలో దళితులు, బీసీలు, మైనార్టీల సమస్యలను అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం దృష్టికి తేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మరోసారి సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఆయన వెంట ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ తదితరులున్నారు.

భట్టి విక్రమార్కను కలిసిన వెంకటేశ్



గౌలిపురా: తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం గాంధీభవన్‌కు వచ్చిన భట్టి విక్రమార్కను వెంకటేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెంకటేశ్‌ను ఆప్యాయంగా పలకరించారు. హైదరాబాద్‌లో ఎన్నికల ప్రచారం ఏ విధంగా జరుగుతుందని వెంకటేశ్‌ను భట్టి అడిగి తెలుసుకున్నారు.

కులమతాలకు అతీతంగా అభివృద్ధి చేస్తాం

చార్మినార్: తమ పార్టీని గెలిపిస్తే.. కుల, మతాలకు అతీతంగా అభివృద్ధి చేస్తామని ఏఐఎంఐఎం ఇంక్విలాబ్ పార్టీ అధికార ప్రతినిధి, చేవెళ్ల పార్లమెంట్ నియోజక వర్గం అభ్యర్థి మహ్మద్ అబ్దుల్ కవి అబ్బాసీ అన్నారు. మంగళవారం పాతబస్తీ శివారు ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు మార్పు కోరుకుంటున్నారన్నారు. ప్రధాన పార్టీ అభ్యర్థులను కాకుండా ప్రత్యామ్నాయంగా తమ పార్టీకే ఓట్లు వేసి గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. సెక్యులర్ పార్టీ అయిన తమ పార్టీని గెలిపిస్తే.. ఆశించిన స్థాయిలో అభివృద్ధిని సాధిస్తామన్నారు.



మిధానిలోని ఎంపీహెచ్‌సీసీ రెండో అంతస్తు ప్రారంభం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న మిధాని సీఎండీ డాక్టర్ ఎస్.కె.ఝా

సంతోష్‌నగర్: మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని)లో సీఎస్ఆర్‌లో భాగంగా మిధాని ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ (ఎంపీహెచ్‌సీసీ) కేంద్రం రెండో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం కేంద్రం మరో అంతస్తును మిధాని సీఎండీ డాక్టర్ ఎస్.కె.ఝా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్.కె.ఝా మాట్లాడుతూ..ఎంపీహెచ్‌సీసీ స్థానిక ఆసుపత్రుల సహకారంతో కంటి, కార్డియో, ఆర్థియో, గైనే క్యాంపులను నిర్వహిస్తుందన్నారు. ఇప్పటి వరకు 8 నేత్ర శిబిరాలు నిర్వహించి మొత్తం 30 మంది రోగులకు కార్పొరేట్ కంటి ఆసుపత్రుల సహకారంతో శుక్ల శస్త్ర చికిత్సలు ఉచితంగా అందించామన్నారు. ఎంపీహెచ్‌సీసీలో బీపీ, షుగర్, రక్తహీనత వంటి దీర్ఘకాలిక వ్యాధులకు ఉచితంగా మందులను కూడా అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌సీసీ ట్రస్టు చైర్మన్, ఫైనాన్స్ జీఎం మధుబాల, ఫైనాన్స్ డైరెక్టర్ ఎస్.గౌరీ శంకర్, ప్రొడక్షన్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ ముత్తు కుమార్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ ఉపేందర్ వెన్నం తదితరులు పాల్గొన్నారు.